
మహాచండి అలంకారంలో మావుళ్లమ్మ

మహాచండి

భీమవరం టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల సందర్భంగా మావుళ్లమ్మ అమ్మవారు ఆదివారం మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మద్దరాల మల్లికార్జునశర్మ అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన, చండీయాగం నిర్వహించారు. వివిధ అలంకారాల్లో అమ్మవారు దర్శనమిచ్చారు.


చండీ హోమం పూజల్లో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి

గోదావరి ఉధృతి

- కనకాయలంక కాజ్‌వేపై వరద నీరు
- మునిగిన పుష్కర ఘాట్‌లు
- పంటు, పడవ రాకపోకల నియంత్రణ
- రేవు వద్ద పోలీసు బందోబస్తు

కుక్కునూరు / వేలేరుపాడు / పోలవరం / ఆచంట / యలమంచిలి /నరసాపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. శనివారం సాయంత్రం కొంత నెమ్మదించిన గోదావరి ఆదివారం ఉదయం నుంచి పెరుగుతోంది. భద్రాచలం వద్ద 43.50 అడుగుల నీటి మట్టం నమోదు కావడంతో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కుక్కునూరు, వేలేరుపాడు మండల వాసులను గోదావరి భయపెడుతోంది. గుండేటివాగు లోలెవెల్ కాజ్‌వే నీటమునిగింది. పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే నుంచి గోదావరి జలాలు దిగువకు విడుదల చేస్తున్నారు. ఆచంట మండలం కోడేరు, పెదమల్లం, భీమలాపురం, కరుగోరుమిల్లి పుష్కరఘాట్‌లు పూర్తిగా నీట మునిగాయి. గోదావరిలో నాటుపడవలు రాకపోకలు కూడా నామమాత్రంగా తిరుగుతున్నాయి. యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వే నీట మునిగింది. గ్రామస్తులు కాజ్‌వే వద్ద పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఆగస్టులో రెండుసార్లు, ఈ నెలలో రెండుసార్లు గోదావరికి వరద రావడం


కనకాయలంక కాజ్‌వేపై పడవలో రాకపోకలు

కాజ్‌వే సుమారు 15రోజులు ముంపులోనే ఉంది. నరసాపురం వద్ద వశిష్ఠ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. వలంధర్ రేవులో స్నానాలు నిలుపుదల చేశారు. బాపు ఘాట్ వద్ద నీరు మెట్ల వరకు చేరింది. గోదావరిలో వలకట్లను మత్స్యకారులు తొలగించారు. మాధవాయిపాలెం- సఖినేటిపల్లి రేవుల మధ్య పంటు, పడవల రాకపోకలను శనివారం రాత్రి నుంచి నిలుపుదల చేశారు. పడవల రాకపోకల నియంత్రణకు రేవులో పోలీస్ బందోబస్తు ఉంచారు.

రిజిస్ట్రేషన్ జోష్

జిల్లాలో రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరిగింది. దాదాపు ఆరేళ్లుగా స్తబ్దతతో ఉన్న రియల్ ఎస్టేట్ రంగానికి ఊరట లభించింది. గత ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టిన భవనాలు ప్రస్తుతం ఒక్కొక్కటిగా అమ్ముడుపోతున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం కూడా గత ఏడాది కంటే పెరగడం అధికారుల్లో కాస్త జోష్ నింపింది. రిజిస్ట్రేషన్లు సులభతరమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తాడేపల్లిగూడెంలో గత ఐదేళ్లలో నిర్మాణదారులు చేపట్టిన వ్యక్తిగత భవనాలు అప్పట్లో అమ్ముడుపోలేదు. వాటిపై బ్యాంకుల్లో రుణాలు తీసుకుని ఆర్థిక ఇబ్బందులను తాత్కాలికంగా అధిగమించారు. ప్రస్తుతం ఒక్కొక్క భవనం అమ్ముడు పోతున్నాయి. లేఅవుట్ వెంచర్‌లలో స్థలాలు కొనుగోలు పెరిగింది.



- జిల్లాలో పెరిగిన ఆదాయం
- ఉండిలో లక్ష్యానికి మించి రిజిస్ట్రేషన్లు
- భీమవరంలో రిజిస్ట్రేషన్లకు కొర్రీలు
- సమీప కార్యాలయాలకు వెళుతున్న జనం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రియల్ ఎస్టేట్ ఊపందుకోవడంతో భవన నిర్మాణాలకు బిల్డర్లు, స్థలాలు కొనుగోలు చేసిన వారు ముందుకు వస్తున్నారు. ఒక్కొక్క వెంచర్‌లో పది వంతున భవనాలు నిర్మించుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. కొత్తవారు కూడా నిర్మాణ రంగంలోకి వచ్చేలా ప్రణాళికలు చేసుకుంటున్నారు. దీని ప్రభావం రిజిస్ట్రేషన్ శాఖలో స్పష్టంగా కనిపిస్తోంది. గత ఏడాది లక్ష్య ఛేదనలో 54 శాతం చేరుకోవడానికి రిజిస్ట్రేషన్ శాఖ నానా తంటాలు పడింది. ఈ ఏడాది 80శాతానికి పైగా ఆదాయం సాధించింది. ఇదే జోరు కొనసాగితే వచ్చే మార్చి మాసాంతానికి వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటామన్న ధీమా రిజిస్ట్రేషన్ శాఖలో నెలకొంది. అధికారులు సైతం ధీమాతో ఉన్నారు. జిల్లాలోని అత్యధిక టర్నోవర్ ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు మంచి జోష్ మీదున్నాయి. భీమవరం పట్టణ పరిధిలోని గునుపూడి, ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరింది. ఆ తర్వాత స్థానంలో తాడేపల్లిగూడెం ఉంది.

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ శాఖ పెద్దగా ఆదాయం సాధించలేదు. వాస్తవానికి 2024 మార్చి నుంచి సెప్టెంబరు వరకు జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ.302.00 కోట్లు ఆదాయం సాధించాలి. కానీ రూ.175.81 కోట్లు ఆదాయం వచ్చింది. 58.17శాతం మాత్రమే నమోదైంది. ఈ ఏడాది మార్చి-సెప్టెంబరు మధ్య రూ.209.24 కోట్లు లక్ష్యాన్ని చేరుకుంది. ఈసారి సెప్టెంబరు వరకు రూ.268.23 కోట్లు సాధిస్తే సరిపోతుందని ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. 78.01శాతం నమోదు చేసుకోవడంతో అధికారుల్లో కాస్త ధీమా వ్యక్తమైంది. మరోవైపు ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం ఇవ్వడంతో రిజి స్ట్రేషన్లు పెరిగే అవకాశం ఉంది. స్థలాల క్రయవిక్రయాలు మెల్లగా పెరుగుతున్నాయి. భవిష్యత్‌లో మరింత ఆదాయం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఏమైంది?

జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలో రిజిస్ట్రేషన్‌లు తక్కువగా ఉంటున్నాయి. ఆశించిన స్థాయిలో ఆదాయం లేదు. భీమవరం పరిధిలో రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. గునుపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 93శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 54. శాతం మాత్రమే ఆదాయం వచ్చింది. అక్కడ కొర్రీలు అధికంగా ఉంటున్నాయని గునుపూడి, ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి భీమవరం ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఆ రెండు కార్యాలయాల్లో ఆదాయం గణనీయంగా పెరిగింది. ఉండిలో ఇప్పటిదాకా 138 శాతం ఆదాయం ఉంది. భీమవరంలో ఆదాయం పడిపోవడంపై అంతా విస్మయం వ్యక్తమవుతోంది. సెప్టెంబరు వరకు రిజిస్ట్రేషన్ ఆదాయం ఇలా ఉంది.

కార్యాలయం	లక్ష్యం రూ.కోట్లలో	డాక్యుమెంట్‌లు	ఆదాయం రూ.కోట్లలో	శాతం
తాడేపల్లిగూడెం	37.06	8139	30.43	82.09
అత్తిలి	10.34	3075	8.84	85.87
ఆచంట	6.28	1894	5.50	87.49
ఆకివీడు	10.59	2296	9.98	94.19
భీమవరం	51.96	3745	28.33	54.53
మొగల్తూరు	11.17	2302	7.72	69.18
నర్సాపురం	16.24	3492	13.68	84.29
పాలకొల్లు	24.74	4676	19.68	79.58
పెనుగొండ	8.67	2579	6.63	76.5
పెంటపాడు	5.81	2012	6.65	114.58
తణుకు	27.15	3166	17.81	65.59
ఉండి	8.03	2099	11.08	138.04
వీరవాసరం	6.91	2182	6.67	96.42
గునుపూడి	25.04	3621	23.37	93.32
సజ్జాపురం	18.16	3686	12.78	70.93


గోదావరి ఒడ్డున వేస్తున్న చెత్త

డంపింగ్ యార్డ్ ఎక్కడ?

- వశిష్ఠ తీరంలో చెత్తపై గ్రీన్ ట్రిబ్యునల్ అభ్యంతరం
- మూడు నెలల్లో ఖాళీ చేయాలని ఆదేశాలు
- ముంచుకొస్తున్న గడువు
- ప్రత్యామ్నాయ స్థల సేకరణలో వెనుకబాటు

నరసాపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వశిష్ఠా నది తీరాన్న స్మృతివనం వద్ద డపింగ్‌యార్డును మూడు నెలల్లో ఖాళీ చేయాలని చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ అధికారులను ఆదేశించింది. ఇప్పటికి నెలన్నర గడిచినా ప్రత్యామ్నాయ స్థలం ఎంపికపై పురపాలక సంఘం అధికారులకు స్పష్టత రాలేదు. ఎక్కడ ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్నా స్థానికుల నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. తాజాగా 28వ వార్డులో పురపాలక సంఘ స్థలం 2 ఎకరాల్లో చెత్త డంపింగ్‌కు ప్రయత్నించడంతో స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. అక్కడ చెత్త వేస్తే ఊరుకోబోమని కౌన్సిలర్లు షేక్ యాకోబ్‌బీబీ, శ్యామాల కౌన్సిల్ సమావేశంలో హెచ్చరించారు. దీంతో ఈ సమస్యను ఏ విధంగా పరిష్కారించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు గ్రీన్ ట్రిబ్యునల్ గడువు సమీపిస్తోంది.

20 ఏళ్లుగా గోదావరి ఒడ్డునే..

పురపాలక సంఘం గత 20 ఏళ్లుగా గోదావరి ఒడ్డున చెత్త డంప్ చేస్తోంది. స్థానికుల అభ్యంతరాలతో పాటు పట్టణానికి చెందిన ఓసూరి ఫణికర్ చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. నదీ జాలాలు కలుషితం అవుతాయని, నివాసాల సమీపంలో చెత్తతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ట్రిబ్యునల్‌కు వివరించారు. దీనిపై ట్రిబ్యునల్ పొల్యూషన్ బోర్డును పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అధికారులు కంపోస్టుయార్డు సమీపంలో నమూనాలు సేకరించారు. వీటిల్లో ప్రమాదకరమైన కలుషితాలు ఉన్నాయంటూ నివేదిక ఇచ్చారు. దీంతో ట్రిబ్యునల్ తక్షణం ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని మరోసారి ఆదేశించింది

అన్ని చోట్ల ప్రతిఘటనలే..

వేములదీవి గ్రామంలో 15 ఏళ్ల క్రితం పురపాలక సంఘం స్థలాన్ని కొనుగోలు చేసింది. అక్కడ చెత్త వేయడానికి స్థానికులు అభ్యంతతం తెలిపారు. స్మృతివనం డంప్ చేయడంతో అది నిండుకుంది. తరువాత మునిసిపల్ కార్యాలయంలో ఖాళీ స్థలం, 28వార్డు స్థలంలో చెత్త డంప్ నిర్ణయాలను స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

ప్రభుత్వ స్థలాల్లో పేదలకు పట్టాలు

- ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- అధికారులకు జేసీ ఆదేశాలు
- పేదలను కలిసిన రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరంలేని పోరంబోకు భూములలో పేదలకు పట్టాల మంజూరుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామంలో జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆదివారం పలు నివా సాలను పరిశీలించారు. ప్రభుత్వ పోరంబోకు స్థలాలలో ఇల్లు నిర్మించుకున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి ఇంటి పన్ను, కరెంట్ బిల్లు రసీదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవో ఎంఎస్ నెంబర్ 30 ప్రకారం 2019 ముందు ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న అందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. లబ్ధిదారులు ఇంకనూ ఎవరైనా ఉంటే వివరాలు సేకరించి ప్రతిపాదనలను పంపాలని జేసీ రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, మండల సర్వేయర్, వీఆర్వో, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్

భీమవరం టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభు త్వ వైద్యులకు పీజీ వైద్య విద్య క్లినికల్, నాన్ క్లినికల్ కోర్సుల్లో ఇన్ సర్వీస్ కోటా తగ్గించడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) ఆందోళన కొనసాగుతోంది. ఆదివారం అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి వైద్యులు వైదొలిగారు. సోమవారం నుంచి పీహెచ్‌సీల్లో ఓపీ సేవలను నిలుపుదల చేస్తున్నారు. ఎమర్జెన్సీ కేసులను మాత్రమే వైద్యులు చేపడతారు. జిల్లాలో 62 మంది పీహెచ్‌సీ వైద్యులతోపాటు ఇతర ప్రభుత్వ వైద్యులు కలిపి దాదాపు 80 మంది ఆందోళనలో పాల్గొంటున్నట్లు సమాచారం. 26న ఆన్‌లైన్‌లో రిపోర్టింగ్ సేవలను నిలుపుదల చేశారు. 27న స్వస్థ్ నారీ, 104 సేవలను నిలుపుదల చేశారు. ఆదివారం అధికారిక వాట్సాప్ గ్రూపులను బహిష్కరించారు.

30న జిల్లా కేంద్రాల్లో నిరసన

ఆందోళన బాటలో భాగంగా ఈనెల 30న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతారు. 1న జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీ, ప్రదర్శనలు చేపట్టనున్నారు. వచ్చే నెల 3 నుంచి విజయవాడలో నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కరించక పోతే తదుపరి కార్యాచరణ ప్రకటించనున్నారు.

ప్రధాన డిమాండ్స్ ఇవే..

- జీవో 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్ పీజీ కోటా పునర్ధరించాలి.
- సమయ నిర్ధారిత ప్రమోషన్‌లు ఇవ్వాలి.
- ట్రైబల్ అలవెన్స్‌లు, 104, సంచార చికిత్స అలవెన్సులు ఇవ్వాలి.
- నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలి.

ఏడాదిగా సమస్యలు పరిష్కారం కాలేదు



పీజీ వైద్య విద్య క్లినికల్, నాన్ క్లినికల్ కోర్సు ప్రవేశానికి గత ఏడాది కోటా తగ్గించారు. అప్పట్లో ఆందోళన చేపట్టడంతో ప్రభుత్వం స్పందించి 20శాతం ఇవ్వడానికి అంగీకరించింది. అయితే మరలా మరో 5 శాతం తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై మరోసారి ఆందోళన చేపడుతున్నాం. అవే కాకుండా పలు సమస్యలపై కూడా స్పందన లేకపోవడంతో ఆందోళన బాట పట్టాల్సి వచ్చింది.

- కేఎంఆర్ కిశోర్, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



కూరగాయాలు

• ఆకాశాన్నంటిన ధరలు • నిలకడగా ఉల్లి • దిగొచ్చిన చికెన్

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. శరన్నవరాత్రి ఉత్సవాలు కావడంతో వ్యాపారులు ధర పెంచేశారు. టమాటా తప్ప అన్ని కూరగాయ ధరలు కిలో రూ.50 పైగా ఉన్నాయి. మొన్నటి వరకు కిలో రూ.20 కూడా కొనుగోలు చేయని బెండ ఇప్పుడు రూ.50 పలుకుతున్నాయి. తెల్లవంకాయలు కిలో రూ.70, చిక్కుళ్లు రూ.130, దొండ రూ.50, క్యారెట్ రూ.50, బీట్‌రూట్ రూ.50, చిలకడ దుంపలు రూ.80, కాకర రూ.50, కంద రూ.70, ఆనబకాయ రూ.30 ధరకు విక్రయిస్తున్నారు. గత వారం కిలో రూ.30 నుంచి 40 మధ్య పలికిన మునగకాడలకు ఒక్కసారిగా డిమాండ్ వచ్చింది. కిలో రూ.150 ధర ఉండగా రిటైల్ వ్యాపారుల ఒక్కొక్క కాడ రూ.15 వంతున అమ్మకాలు జరుపుతున్నారు.

మార్కెట్లో కొత్త అల్లం

ఇప్పుడు మార్కెట్లోకి కొత్త అల్లం వచ్చింది. హోల్‌సేల్‌గా 10 కిలోలు రూ.400 ధర ఉండగా రిటైల్ వ్యాపారులు కిలో రూ.80 విక్రయిస్తున్నారు. సాధారణంగా హోల్‌సేల్, రిటైల్ ధర కిలోకు రూ.10 తేడా ఉంటుంది. ఏకంగా కిలోకు రూ.40 పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పుడు మార్కెట్లో పాత అల్లం లేదు. పాత అల్లం హోల్‌సేల్‌గా 10 కిలోలు రూ.600 అమ్ముతున్నారు. పాత అల్లం ఇప్పుడు రుచిగా ఉండకపోవడంతో కొత్త అల్లం కొనుగోలు చేయాల్సి వస్తుంది. కొత్త అల్లం నిలువకు ఆగే అవకాశం లేదు. పాత అల్లం జనవరి నాటికి గాని మార్కెట్‌కు రాదు. అప్పటి దాకా కొత్త అల్లంతోనే విక్రయాలు సాగుతాయి.

నిలకడగా ఉల్లి ధర

ఉల్లి ధరలు మార్కెట్లో నిలకడగా ఉన్నాయి. తాడేపల్లిగూడెం మార్కెట్‌కు కడప నుంచి 6లారీలు, కర్నూలు నుంచి ఒక లారీ లోడు వచ్చింది. 7 లారీల్లో 105 టన్నుల ఉల్లి వచ్చింది. టన్ను రూ.800 నుంచి 1100 మధ్య విక్రయించారు. మహారాష్ట్ర నుంచి 9 లారీల్లో 225 టన్నుల ఉల్లిని తీసుకొచ్చారు. క్వింటాలు రూ.1200 నుంచి 1800 మధ్య విక్రయించారు.

తగ్గిన చికెన్ ధర



పండగ సీజన్ కావడంతో చికెన్ ధర దిగి వచ్చింది. రెండు వారాల క్రితం స్కిన్‌లెస్ కిలో రూ.260 వరకు వెళ్లింది. ప్రస్తుతం రూ.220 ధరకు దిగింది. విత్‌స్కిన్ రూ.240 నుంచి రూ.200కు దిగి వచ్చింది. మటన్ ధర మాత్రం తగ్గలేదు. అయితే కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దసరా కావడంతో ఎక్కువ మంది మాంసాహారానికి దూరంగా ఉంటారు. దీంతో వీటి విక్రయాలు తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. పండగ వెళ్లిన తరువాత చికెన్ ధరలు మళ్లీ పెరుగుతాయంటున్నారు.



బోనాలతో గ్రామోత్సవం

కాళ్ళ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోమటిగుంట గ్రామం అమ్మవారి నామ స్మరణతో మారుమ్రోగింది. శరన్నవ రాత్రులను పురస్కరించుకుని కోమటిగుంట గ్రామంలో బోనాల సంబరాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు 200 మంది మహిళా భక్తులు ప్రత్యేక అలంకరణలో, భవాని మాల ధారులు నెత్తిన బోనాలు పెట్టుకుని గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా సాగిన గ్రామోత్సవాన్ని తిలకించేందుకు గ్రామస్తులు వీధుల్లో నిలిచారు. రామాలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల గ్రామోత్సవం కార్యక్రమంలో భవానీ మాలధారులు, గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

విశాఖస్టీల్ ప్లాంట్ ఆర్టీసీ డిపో లీజ్ పొడిగించాలి

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మకు వినతి

భీమవరం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ సిటీ ఆర్టీసీ డిపోను ప్రస్తుతం నడుస్తున్న చోటు నుంచి లీజు పూర్తి అయిందని యాజమాన్యం నోటీసులు ఇచ్చి ఖాళీ చెయ్యాలని వత్తిడి చేస్తున్నారని, అక్కడే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఎన్ఎంయు రాష్ట్ర కార్యదర్శి వైఎస్ శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు ఆదివారంనాడు కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కలిసి వినతి పత్రాన్ని అందించారు. దీనిపై మంత్రి వర్మ స్పందిస్తూ లీజు గడువు పెంచి అక్కడే డిపో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. ఆర్టీసీ ఉద్యోగులు ఈపీఎఫ్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. విభజన చట్టానికి విరుద్ధంగా పీఎఫ్ ట్రస్ట్ కోడ్‌ను టీఎస్ఆర్టీసీకి కేటాయించటం వల్ల ఉద్యోగులు సమస్యలను వివరించారు. దీని వల్ల హయ్యర్ పెన్షన్ పొందే అవకాశాన్ని ఇక్కడ ఉద్యోగులు కోల్పోతున్నారని తెలిపారు. ఈ సమస్యను పీఎఫ్ సెంట్రల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించే దిశ చర్యలు తీసుకుంటానని హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో శ్రీనివాసరాజు, ఎస్ కుమార్, వైవిరావు, ఎస్ఎస్‌రావు తదితరులుఉన్నారు.

హిందువులు సమైక్యంగా ఉండాలి

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతి శిశు మందిరం హైస్కూల్లో ఆదివారం వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ జిల్లా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రాంతీయ అధికారి సుబ్బరాజు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ హిందూ బంధువులు అందరూ సమైక్యంగా ఉండాలని మన పండుగల్లో ప్రతి కార్యకర్త పాల్గొని హిందుత్వాన్ని కనపరచాలని తెలిపారు. పాలకొల్లు, నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, ఉండి, పాలకోడేరు పోడూరు. పెనుగొండ మండలాలు, పట్టణాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.





కాళ్లకూరులో శ్రీలక్ష్మికి ఐశ్వర్యలక్ష్మి అలంకరణ.. ఆకివీడులో పెద్దింట్లమ్మకు పసుపు-కుంకుమ, పట్టు వస్త్రాలు సారె తీసుకొస్తున్న టీడీపీ ప్రధాన కార్యదర్శి ఉమా కుటుంబం.. భీమవరంలో వాసవీ మాతకు కుంకుమార్చన

మహాచండి అలంకరణ

వైభవంగా దసరా వేడుకలు... కుంకుమ పూజలు

ఆకివీడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం మహాచండీదేవిగా పెద్దింట్లమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శాంతి నగర్ నూకాలమ్మ ఆలయం నుంచి నిర్మాణ కమిటీ అధ్యక్షులు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా కుటుంబ సమేతంగా పెద్దింట్లమ్మకు పసుపు-కుంకుమ, పట్టు వస్త్రాలు సారె తీసుకెళ్ళారు. సాలిపేట నుంచి టీడీపీ కౌన్సిలర్ బత్తుల శ్యామల నేతృత్వంలో వీరభద్ర స్వామి దేవాలయం నుంచి సారె తీసుకెళ్ళారు. భీమవరం డీఎస్పీ జయసూర్య దంపతులు పెద్దింట్లమ్మను దర్శించుకున్నారు.

కాళ్ల: కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 7వ రోజు ఆదివారం ఐశ్వర్యలక్ష్మిగా శ్రీలక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

ఉండి: ఎన్ఆర్‌పిఅగ్రహారం సివిల్ సప్లయిస్ గొడౌన్స్ వద్ద అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాచండీదేవీ అలంకరణ గావించారు. వచ్చేనెల 3వ తేదీన ఉదయం 11.30గంటల నుంచి అఖండ అన్నసమారాధన జరుగుతుందని కనకదుర్గ అమ్మవారి ఆలయకమిటీ జట్టు(హమాలీ వర్కర్సు)తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

వాసవీ మాతకు కుంకుమ పూజలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : త్యాగరాజ భవనంలో 108 మంది కన్యలచే సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఆదివారం శ్రీవాసవీ కన్యక పరమేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి రాజరాజేశ్వరి దేవి అలంకరణ చేశారు..

చండీహోమంలో కలెక్టర్

భీమవరం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ ఆలయంలో నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నాడు నిర్వహించిన చండి హోమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ముందుగా మహా చండి అలంకారంలో ఉన్న మావుళ్ళమ్మను దర్శించుకున్నారు.ఆనంతరం ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో జరిగిన హోమాల్లో పాల్గొన్నారు. ఆదివారం కావటంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ప్రయోజనం



జీఎస్టీ తగ్గింపుపై బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రధాని మోదీ చేపట్టిన జీఎస్టీ సంస్కరణ ద్వారా పేద మధ్య తరగతి వారికి ఎంతో ఉపకరిస్తుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో స్వదేశీ వస్తువులను వాడదాం, భారతదేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేద్దాం అనే ప్రచార భేరి బ్రోచర్‌ను ఎమ్మెల్యే అంజిబాబు ఆవిష్కరించారు. మనం విని యోగించే ప్రతి వస్తువు మన దేశంలో తయారైనవే వాడాలని, జిల్లాల్లో ఇప్పటికే ప్రచార భేరీ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా మన ఆదాయం మన దేశంలోనే ఉంటుందని, తద్వారా భారత ఆర్థిక వ్య వస్థ పటిష్ట పడుతుందన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ఇంటింటా ప్రచారం చేయాలి

గణపవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం తగ్గించిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి కోరారు. ఆదివారం గణపవరం మండలం పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలకు సమావేశం నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించేందుకు అధికారులను నియమించారు. ఈ నెల 29 నుంచి అక్టోబర్ 19 వరకు ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు.

దంపతులకు గాయాలు

భీమవరం క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్ళ మండలం పెద అమిరం గ్రామానికి చెందిన తాడి నాగరాజు ఆదివారం భార్యభర్తలు కలిసి పని నిమిత్తం భీమవరం వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో సరిగ్గా అడ్డవంతెన వద్దకు వెళ్ళేసరికి వెనుక నుంచి వస్తున్న కారు వారి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ర్యాబిస్ నివారణపై అవగాహన ర్యాలీ

భీమవరం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ ర్యాబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28వ తేదీన లూయిస్ పాశ్చర్ వర్ధంతి సందర్భంగా జాతీయ ర్యాబిస్ నివారణ దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. ర్యాబిస్ అనేది కుక్కలు, పిల్లులు, అడవి జంతువుల ద్వారా మనుషులకి వ్యాప్తి చెందుతుందని, ఇది ఒక ప్రమాదకరమైన వైరస్ అని అన్నారు. ఒకసారి వ్యాధి వస్తే చికిత్స లేకుండా ప్రాణాంతకం అవుతుందని, అయితే ముందు జాగ్రత్తలతో ర్యాబిస్‌ను వంద శాతం నివా రించవచ్చునని పేర్కొన్నారు. ర్యాబిస్ నివారణకు కుక్కలు, పిల్లులు, పెంపుడు జంతువులకు తప్పనిసరిగా ర్యాబిస్ వాక్సిన్ వేయించాలని కోరారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు దసరా

భీమవరం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ దసరా అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా పండుగ మనిషిని మంచిమార్గంలో నడిపించడానికి ఒక స్ఫూర్తిగా నిలుస్తూ ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలన్నారు. ప్రతి ఒక్కరూ అత్యంత ఆనందంతో దసరా పండుగను జరుపుకోవాలని అన్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య వర్తక సంఘం సభ్యులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ, సోమేశ్వరస్వామికి జీఎస్టీ అధికారి పూజలు



మావుళ్ళమ్మను దర్శించుకున్న జాయింట్ కమిషనర్ నాగార్జున రావు

భీమవరం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ జాయింట్ కమిషనర్ (ఏలూరు డివిజన్) బి.నాగార్జున రావు కుటుంబ సభ్యులతో పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని ఉమా సోమేశ్వర జనార్దన స్వామి వారిని, మావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు అనంతరం వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున ప్రసాదాన్ని శేష వస్త్రాన్ని అందించారు. ఆయన వెంట ఉద్యోగ సిబ్బంది జీఎస్టీఅధికారి వర్దనపు రాజేష్ కుమార్, తుమ్మిడి రాజశేఖర్, ఎమ్.కె.దుర్గారావు, షబ్బీర్, శివ న్నారాయణ పాల్గొన్నారు

రోడ్ల అభివృద్ధి పనులు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ వెంకటాచార్యులు

ఉండి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):వర్షాలు నేపథ్యంలో రోడ్ల మరమ్మతు పనులను చేయిస్తునట్లు సర్పంచ్ సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు అన్నారు. ఆదివారం ఎన్ఆర్‌పిఅగ్రహారంలోని ఎస్‌సీపేటలో రోడ్లను అభివృద్ధి పరిచే పనులను చేపట్టారు. నల్లకంకరను వేయించి రహదారి మార్గాలను అభివృద్ధి పరిచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కిన్నెర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభ సన్మాన్ అవార్డులు

పెనుగొండ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):విద్య, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన ఉభయగోదావరి జిల్లా ఆర్యవైశ్య విద్యార్థులకు వాసవీ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ పీఎన్ గోవిందరాజులు ఆధ్వర్యంలో అవార్డులు అందించారు. ఆదివారం వాసవి ధామ్ టెంపుల్‌లో ప్రతిభ సన్మాన్ అవార్డు 2024-25 కార్యక్రమంలో భాగంగా ప్రతిభా వంతులైన విద్యార్థులకు 370 మందికి అవార్డులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కర్ణాటక రాష్ట్రం తూంకూరు యూనివర్శిటీ వైస్ చాన్సలర్ శ్రీ ఎం. వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్, ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షు డు చిన్ని రామ సత్యనారాయణ చేతులు మీదుగా ప్రతిభ అవార్డులు అందజేశారు. ముందుగా పెనుగొండలో పురవీధులు గుండా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

భక్తులకు నిరాశ....

పెనుగొండ వాసవి శాంతి ధామ్‌లో భక్తులకు ఆదివారం నిరాశ ఎదురైంది. సుదూర ప్రాంతాల నుంచి ప్రతిభ సన్మాన్ అవార్డులు తీసుకోవడానికి వచ్చిన భక్తులకు ప్రసాదం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం 1 గంట సమయం దాటినా అన్నదానం మొదలు పెట్టకపోవడంతో గంటల తరబడి భక్తులు నిల్చుండిపోయారు. సుమారు రెండు గంటల సమయం అయినా అన్నదానం చేయకపోవడంతో చాలా మంది వెనుతిరిగి వెళ్ళిపోయారు. దీంతో శాంతి ధామ్ నుంచి శ్రీ నగరేశ్వర స్వామి మహిషాసురమర్ధని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవార్ల ఆలయానికి చేరుకుని ప్రసాదం స్వీకరించారు.

19న ధన్వంతరి జయంతి

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం సమావేశం నాయీ బ్రాహ్మణ సంఘ భవనంలో ఆదివారం జరిగింది. సమావేశానికి అధ్యక్షుడు ర్యాలీ విష్ణుమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ వైద్య పితామహుడు నాయీ బ్రాహ్మణ ఆదిపురుషుడు ధన్వంతరీ మహాదేవుని జయంతిని వచ్చేనెల 19వ తేదీన ఘనంగా నిర్వహించడానికి సంఘ సభ్యులు సహకరించాలని సూచించారు. ఈసందర్భంగా వైద్య వృత్తిలో కొనసాగుతున్న నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులను సత్కరించాలని తీర్మానించారు.

మహా చండీదేవి నమోస్తుతే..

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో అమ్మవారి ఆలయాల వద్ద దేవీనవరాత్రుల్లో భాగంగా ఆదివారం ఏడో రోజు ఆలయాల్లో అమ్మవార్లు శ్రీ మహా చండీదేవి అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఏలూరు-సత్రంపాడులో మహాచండీదేవిగా అంబికాదేవి


రాట్నాలకుంటలో విశేష అలంకరణలో రాట్నాలమ్మవారు


పాలకొల్లులో రూ.1.40 కోట్లతో ధనలక్ష్మి అలంకారంలో వాసవీ మాత


తాడేపల్లిగూడెంలో మహాచండీదేవిగా బలుసులమ్మ


ఆచంటలో మహాచండీ దేవిగా పార్వతి దేవి


సత్రంపాడులో మహాలక్ష్మీదేవి అలంకరణలో సౌభాగ్యలక్ష్మీదేవి


పత్తేబాదలో కనకదుర్గాంబ అలంకరణలో అమ్మవారు


జంగారెడ్డిగూడెంలో మహాచండీదేవి అలంకరణలో గంగానమ్మ


నరసాపురం మండలం సరిపల్లి గ్రామంలో రూ.6 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ


పెనుగొండలో రాజరాజేశ్వరిదేవిగా వాసవి మాత


కొయ్యలగూడెంలో కనకదర్గమ్మ అలంకరణలో అమ్మవారు


జంగారెడ్డిగూడెంలో మహాచండీ దేవిగా వాసవీ కన్యకా పరమేశ్వరి

నేడు ఏలూరులో అంతర్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఈనెల 29న వెయిట్ లిఫ్టింగ్ (ఇంటర్ డిస్ట్రిక్ట్) అండర్-14 బాలికల చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఏపీఎస్ ఆర్డీసీ ఛైర్మన్ బడేటి వెంకట్రామయ్య, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దిన్నా బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని వారు తెలిపారు. ఏపీ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ అధ్యక్షురాలు, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి అధ్యక్షతన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పోటీలు ప్రారంభిస్తారన్నారు.

మరికంటి గోపాలకృష్ణకు రాష్ట్రస్థాయి అవార్డు


ఎమ్మెల్సీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న గోపాలకృష్ణ

చింతలపూడి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడ్డేశ్వరంలోని కేఎల్ యూ యూనివర్సిటీలో జరిగిన కిసాన్ మహోత్సవం-2025లో 'కిసాన్ అంగడి' వ్యవస్థాపకుడు చింతలపూడి మండలానికి చెందిన మరికంటి గోపాలకృష్ణకు ఉత్తమ రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విస్తరణ నిపుణుల అవార్డు లభించింది. ఈ అవార్డును రాష్ట్ర ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. గత ఎనిమిదేళ్లుగా గోపాలకృష్ణ తన భూమిలో ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు తనకెంతో సంతోషం కలిగించిందని, ఇది వ్యక్తిగత విజయంకాదని రైతుల ప్రోత్సాహం, ప్రకృతి వ్యవసాయంపై తనకున్న నమ్మకం ముందుకు తీసుకువెళ్లిందన్నారు.





ఎలుబూడి విజయ్‌కుమార్, షేక్ షాహిన్‌లను అభినందిస్తున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

నాడు కార్యదర్శులు నేడు టీచర్లు

- డీఎస్సీకి ఎంపికైన కార్యదర్శులను అభినందించిన తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి, ఎంపీడీవో శ్రీనివాస్

ఇరగవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి ఉద్యోగాలకు ఎంపికైన ఇరగవరం మండల పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ఎ.శ్రీనివాసు అభినందించారు. పొదలాడ గ్రామ సెక్రటరీ ఎలుబూడి విజయ్ కుమార్, కె.కుముదవల్లి గ్రామ సెక్రటరీ షేక్ షాహిన్ 2019లో ప్రభుత్వ ఉద్యో గంలో చేరి ఆరేళ్లపాటు విధులు నిర్వర్తిస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిపై ఇష్టంతో దొరికిన సమయంలోనే చదువుకుంటూ వారి ఆశలను నెరవేర్చుకున్నారు. వీరిద్దరిని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందించారు. ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు.

టీచర్ కావాలనే ఆశతో : ఎలుబూడి విజయ్‌కుమార్

మా స్వగ్రామం తణుకు మండలం దువ్వ, తల్లిదండ్రులు వ్యవసాయదారులు, 2018 సచివాలయ గ్రేడ్-5 సెక్రటరీగా ఉద్యోగం సాధించా. వీరవాసరం మండలం రాయకుదురు, అత్తిలి మండలం కేఏస్ గట్టు గ్రామాలలో విధులు నిర్వర్తించి ప్రస్తుతం ఇరగవరం మడలం పొదలాడ గ్రామంలో విధులు నిర్వ ర్తిస్తున్నా. టీచర్ ఉద్యోగంపై ఆసక్తితో డీఎస్సీ కోసం ప్రయత్నం చేస్తూ టీజీటీ (సైన్స్)గా ఉద్యోగం పొందా. విద్యార్థులకు నా వంతు సహాయ సహకారాలను అందిస్తా.

డీఎస్సీ కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూశా : షేక్ షాహిన్

నాకు చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయ వృత్తి అటే ఎంతో ఇష్టం. నా కలలను నిజం చేసుకోవడానికి డీఎస్సీ పరీక్ష కోసం ఎన్నో ఏళ్ల నుంచి వేచి చూశా. నా కష్టానికి ఫలితంగా 2025 మెగా డీఎస్సీలో టీచర్‌గా ఎంపికైనందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ విజయవానికి నా భర్త, తల్లిదండ్రుల కృషి చాలా ఉంది. విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించేందకుఉ కృషి చేస్తా.

వైభవంగా దుర్గామాత గ్రామోత్సవం

- పెదపాడులో లక్ష గాజులు, సారె సమర్పణ
- ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

పెదపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రుల్లో భాగంగా పెదపాడు శ్రీగంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయం ఆధ్వర్యంలో దుర్గామాత గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి లక్ష గాజుల నివేదనలో భాగంగా తొలుత గాజుల పూజ, హోమం, కుంకుమార్చనలు నిర్వహించి పెద్ద సంఖ్యలో మహిళలు, మాలధారణ చేసిన భవానీలు గాజులు, అమ్మవారికి సారెతో గ్రామోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామోత్సవం ముందు చిన్నారుల కోలాటాలు, సన్నాయి వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. పెదపాడు పాలకేంద్రం సెంటర్ నుంచి విఘ్నేశ్వరస్వామి దేవాలయం మీదుగా శివాలయం చేరుకుంది. అనంతరం దుర్గామాతకు సారె, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నౌలూరి దీపు, శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



పెదపాడులో దుర్గమ్మ గ్రామోత్సవం గాజులు, సారెతో భవానీలు, మహిళలు

జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు మధురశ్రీ


పోటీలకు ఎంపికైన వీఎస్ఎన్ విద్యార్థిని మధురశ్రీ

కొయ్యలగూడెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం వీఎస్ఎన్ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని మధురశ్రీ జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైనట్టు కళాశాల కరస్పాండెంట్ వీఎస్ఎన్.స్వామి తెలిపారు. ఈనెల 28న ఒంగోలులో బీఆర్ ఒలింపియాడ్‌లో ఏర్పాటు చేసిన గేమ్స్‌లో సెపక్‌తక్రా గేమ్‌లో రాష్ట్రస్థాయిలో మూడో స్థానం కైవసం చేసుకుంది. ఈమేరకు విద్యార్థినిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు కరస్పాండెంట్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను విద్యార్థులు, అధ్యాపకులు అభినందించారు

స్థానిక వస్తువులను కొనుగోలు చెయ్యాలి

భీమవరం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి కోసం స్థానికంగా తయారయ్యే వస్తువులనే కొనుగోలు చేయాలనే ప్రధాని పిలుపుని ప్రతి ఒక్కరూ ఆచరించాలని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలో జిల్లా బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కేఎస్ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక స్క్రీన్‌పైన ప్రధాని మోదీ 126వ మన్-కి-బాత్ కార్యక్రమాన్ని ప్రత్యేక ప్రసారం ద్వారా ఆయన బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. ఆత్మనిర్భర్ భారత్ స్వదేశీ సంకల్ప పత్రాన్ని చదువుతూ ప్రతిజ్ఞ చేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక, రాష్ట్ర కార్యదర్శి బోగిరెడ్డి ఆదిలక్ష్మి, పేరిచర్ల సుభాష్‌రాజు, అయినంపూడి శ్రీదేవి, నార్ని తాతాజీ తదితరులు పాల్గొన్నారు.


న్యాయ సలహా కేంద్రాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి శ్రీదేవి

సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ

నరసాపురం టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైలును ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో పరిశుభ్రత, ఖైదీలకు అందుతున్న మెను, ఆరోగ్యం, ఇతర సదుపాయాలను రిమాండ్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఏ కేసుల్లో అరెస్టు అయి వచ్చారన్న విషయాన్ని ఆరా తీశారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సలహా కేంద్రం ద్వారా సేవలందిస్తామని వివరించారు. ఆమె వెంట న్యాయమూర్తి రత్నప్రసాద్, సబ్‌జైలు అధికారి అప్పారావు, న్యాయవాదులు శిరిష, చిట్టి పద్మ, శ్యామ్‌కుమార్ ఉన్నారు.


మేనేజింగ్ పార్టనర్ శ్రీహరిరాజును సన్మానిస్తున్న జనసేన నాయకులు

'ఓజీ' విజయోత్సవం

ఆకివీడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓజీ సినిమా ఆకివీడులో మూడు రోజుల్లో రికార్డు స్థాయిలో కలక్షన్స్ సాధించడంతో ఆదివారం జనసేనాలు విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. మూడు రోజుల్లో రూ.18,32,462లు వసూల్ చేసిందని ఆకివీడు జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు తెలిపారు. ఇప్పటి వరకు ఏ సినిమా ఇంతటి కలక్షన్లు సాధించలేదని తెలిపారు. స్థానిక విజయా థియేటర్ దగ్గర కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. థియేటర్ మేనేజింగ్ పార్టనర్ శ్రీహరిరాజును జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు. జసనేన కౌన్సిలర్ గోపిశెట్టి వెంకట సత్యవతి, జనసేన మండలాధ్యక్షుడు బాలాజీ, కన్వీనర్ దారపురెడ్డి కన్నబాబు, చిరంజీవి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏలూరు జిల్లాలో విస్తృతంగా పోలీస్ తనిఖీలు

- మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రోబరీ గ్యాంగుల ప్రవేశంపై అప్రమత్తం


ఏలూరు లాడ్జిలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ కోటేశ్వరరావు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ గ్యాంగులు ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి నేరాలకు పాల్పడడంతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ యంత్రాంగం లాడ్జీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లను తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు వారి సిబ్బంది కలిసి లాడ్జీలను తనిఖీ చేస్తూ అనుమానాస్పద వ్యక్తులను ఆరా తీస్తున్నారు. మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ రోబరీ గ్యాంగులు ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి విశాఖపట్టణం నుంచి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వారు దోపిడీలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఈ గ్యాంగులు లాడ్జీలలో, బస్టాండ్, రైల్వే స్టేషన్లలు తక్కువ ధర లాడ్జీలలో ఉంటున్నారనే సమాచారం ఉండడంతో ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో విస్తృతంగా లాడ్జీల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈగ్యాంగులు హిందీలో మాట్లాడుతున్నారని పగటి వేళ రెక్కీ నిర్వహించి రాత్రి వేళ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. దోపిడీలకు పాల్పడుతున్న ఈ గ్యాంగ్ ఫొటోలను ఇప్పటికే దేవరపల్లి పోలీసులు విడుదల చేశారు. వారి ఆచూకీ చెబితే రూ.50 వేలు పారితోషికం ఇస్తామని ప్రకటించారు.

క్రైం సమాచారం

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తల్లిదండ్రులపై కోపగించుకున్న ఒక యువకుడు పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరులోని వంగాయగూడెంకు చెందిన పడమటి వీరబాబు(27), అతని తండ్రి సత్తిబాబు కలిసి సాయినగర్‌లో ఓ వ్యక్తికి చెందిన ఐదు ఎకరాల వరి పొలాలన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఈనెల 25న సత్తిబాబు అతడి కుమారుడు పురుగుల మందును పొలానికి కొట్టారు. సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత.. ఎంతో కష్టపడ్డాడని మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని తండ్రిని కోరాడు. తల్లిదండ్రులు మందలించడంతో కోపగించుకున్న యువకుడు వెంటనే పొలం వెళ్లి పురుగుల మందు తాగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ, గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రూరల్ ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఆదివారం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

ముసునూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిల్లబోయినపల్లిలోని పెద్ద చెరువు వద్దకు గ్రామానికి చెందిన భీమడోలు జయరాజు (64) ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. స్థానికు లు చెరువులో గాలింపు చర్యలు చేపట్టి వృద్ధుడి మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బేగ్ తెలిపారు.

దంపతులకు గాయాలు

భీమవరం క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్ళ మండలం పెద అమిరం గ్రామానికి చెందిన తాడి నాగరాజు ఆదివారం భార్యభర్తలు కలిసి పని నిమిత్తం భీమవరం వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో సరిగ్గా అడ్డవంతెన వద్దకు వెళ్ళేసరికి వెనుక నుంచి వస్తున్న కారు వారి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.


రహదారి ప్రారంభించిన ఎంపీ పుట్టా, ఎమ్మెల్యే పత్సమట్ల

ఫత్తేపురం- తోకలపల్లి రోడ్డు ప్రారంభం

నిడమర్రు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ అన్నారు. ఆదివారం నిడమర్రు మండలంలో ఫత్తేపురం నుంచి తోకలపల్లి వరకు సుమారు కోటి రూపాయల అంచ నాతో నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, బీజేపీ నాయకురాలు శరణాల మాలతీరాణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు అక్కా సమస్యలను ప్రస్తావించగా సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. గ్రామ ఉపసర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు, సొసైటీ అధ్యక్షుడు పొత్తూరి నరసింహరాజు, కందులపాటి సత్యనారాయణ, గోలి పుండరీకాక్షుడు, అడవికొలను వాటర్ డీసీ ఛైర్మన్ బేతు శివరామారావు, వంగా రఘు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసురాజు, చింతపాటి బాసిరాజు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

గాంధీ స్కూలు ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం

ఏలూరు అర్బన్/ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తోన్న శ్రీగాంధీ ఆంధ్రజాతీయ మహావిద్యాలయం నూతన ట్రస్టు బోర్డు కార్యవర్గంతో ఎమ్మెల్యే బడేటి చంటి ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించారు. ట్రస్టుబోర్డు కాలపరిమితి రెండేళ్లు. బోర్డు ఛైర్మన్‌గా జె.అంజిబాబు, పాలకవర్గ సభ్యులుగా పి.అమ్మాజీ, ఆర్.మోహన్ బోసియే, ఎ.కృష్ణ మోహన్, కె.రామమోహనరావు, వై.వెంకటలక్ష్మి, ఎస్.బలేరాముడు, పి.దేవ కుమారి, ఎం.వి.రామ నరసింహశర్మ, వి.దేవిభారతి, ఎస్.రాజ్‌కుమార్‌లను నియమించిన విషయం విదితమే. కార్యక్రమంలో ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏఎంసీ ఛైర్మన్ ఎం.పార్థసారథి, ఎంఆర్డీ బలరామ్, ఎస్ఎంఆర్ పెదబాబు, స్కూలు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వంకినేని భానుప్రకాశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పీవీ పార్థసారథి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి, విక్రమ్ కిషోర్

స్వదేశీ పరిశ్రమల స్థాపనపై మోదీ దృష్టి

ఏలూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశంపై అమెరికా విధిస్తున్న అధిక సుంకాల నేపథ్యంలో స్వదేశీ పరిశ్రమల అభివృద్ధి పరచడం ద్వారా దేశాన్ని బలోపేతం చేయడానికి ప్రధాని మోదీ దృష్టి సారించాలని కర్నూలు జిల్లా ఆదోని ఎమ్మెల్యే పీవీ పార్థసారథి అన్నారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత 11 ఏళ్లలో రాష్ట్రానికి ప్రతీ ఏటా భారీగా నిధులను కేటాయిస్తోందని, రాష్ట్ర పథకాలకు మోదీ ఆశీస్సులు ఉండటం శుభ పరిణామమన్నారు. బీజేపీ బలోపేతం కోసం ప్రతీ జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలను పార్టీ చేపడుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 25 లక్షల మంది పార్టీ సభ్యులుగా ఉన్నారన్నారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడుఏ గారపాటి సీతారామాంజనేయ చౌదరి(తపన), పార్టీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, శరణాల మాలతీరాణి పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయస్వామి దేవాలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం


వేమూరి శ్రీనివాసరావు

పెదపాడు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి దేవాలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం సోమవారం ఉదయం 11.31 గంటలకు దేవాలయం వద్ద జరుగుతుందని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి. తారకేశ్వరరావు తెలిపారు. ఆలయ ఛైర్మన్‌గా వేమూరి శ్రీనివాసరావుతో పాటుగా పాలకవర్గం సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ప్రజాప్రతి నిధులతో పాటు ఆలయ అధికారులు, దేవాలయ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

దసరా సెలవుల్లో పిల్లలు జాగ్రత్త

గణపవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరాసెలవులు సందర్భంగా పిల్లలు స్నేహితులతో కలిసి కాలువలు, చెరువుల్లోకి ఈతలకు వెళ్లాలని ప్రయత్నాలు చేస్తారని వారి పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని నిడమర్రు సీఐ నక్కా రజనీకుమార్ సూచించారు. గణపవరంలో సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో చెరువులు, కాలువలు, గుంతల్లో వర్షపునీరు భారీగా చేరిందని, వాగులు విపరీతంగా ప్రవహిస్తున్నాయని పిల్లలు ఈ సమయాల్లో కాల్వల్లోకి, చెరువుల వద్దకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



ఓజీ విజయోత్సవం

ఆకివీడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓజీ సినిమా ఆకివీడులో మూడు రోజుల్లో రికార్డు స్థాయిలో కలెక్షన్స్ సాధించడంతో ఆదివారం జనసేనాలు విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. మూడు రోజుల్లో రూ.18,32,462లు వసూల్ చేసిందని జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు తెలిపారు. ఇప్పటి వరకు ఏ సినిమా ఇంతటి కలక్షన్లు సాధించ లేదని తెలిపారు. స్థానిక విజయా థియేటర్ దగ్గర కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. థియేటర్ మేనేజింగ్ పార్టనర్ శ్రీహరిరాజును జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన కౌన్సిలర్ గోపిశెట్టి వెంకట సత్యవతి, జనసేన మండలాధ్యక్షుడు బాలాజీ, కన్వీనర్ దారపురెడ్డి కన్న బాబు, చిరంజీవి సత్యనారాయణ పాల్గొన్నారు.



మేనేజింగ్ పార్టనర్ శ్రీహరిరాజును సన్మానిస్తున్న జనసేన నాయకులు

సమసమాజం కోసం పోరాడిన కవి జాషువా



రచయిత గుర్రం జాషువా జయంతి కార్యక్రమంలో పలువురికి సత్కారం

భీమవరం టౌన్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : కుల, మత అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం తన కలంతో పోరాటం చేసిన మహాకవి గుర్రం జాషువా అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. గుర్రం జాషువా 130వ జయంతిని పురస్కరించుకుని జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం భీమవరం కె.ఎస్.రాజు ఫంక్షన్ హాల్‌లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ హాజరై గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలిగొట్ల గోపాల శర్మ, వేల్పుల నాగేశ్వరరావు, జువ్వాది దాశరధి శ్రీనివాస్‌లను సత్కరించారు. అనంతరం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ముద్రించిన కవి కోకిల గుర్రం జాషువా జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బోగిరెడ్డి ఆదిలక్ష్మీ, నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు, జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి పాల్గొన్నారు

స్థానిక వస్తువులను కొనుగోలు చెయ్యాలి

భీమవరం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి కోసం స్థానికంగా తయారయ్యే వస్తువులనే కొనుగోలు చేయాలనే ప్రధాని పిలుపుని ప్రతి ఒక్కరూ ఆచరించాలని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలో జిల్లా బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కేఎస్ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక స్క్రీన్ పైన ప్రధాని నరేంద్ర మోదీ 126వ మన్-కి- బాత్ కార్యక్రమాన్ని ప్రత్యేక ప్రసారం ద్వారా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. ఆత్మనిర్భర్ భారత్ స్వదేశీ సంకల్ప పత్రాన్ని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ ఇతర బీజేపీ నాయకులు చదువుతూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ అత్యంత బలీయమైన శక్తిగా ఎదగాలంటే ప్రతి చిన్న స్థాయి పరిశ్రమల ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక, రాష్ట్ర కార్యదర్శి బోగిరెడ్డి ఆదిలక్ష్మీ, నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు, జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, మాజీ అధ్యక్షుడు నార్ని తాతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శులు తోట గంగరాజు, వినోద్ వర్మ పాల్గొన్నారు.

ప్రత్యేక ఉప కారాగారం సందర్శన



ఉప కారాగారాన్ని సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

భీమవరం క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భీమవరం ప్రత్యేక ఉప కారాగారాన్ని ఆదివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ ఎస్.శ్రీదేవి, సంస్థ సెక్రటరీ కె.రత్నప్రసాద్ సందర్శించారు. ముద్దాయిలకు న్యాయవాదులు ఉన్నారా? న్యాయవాదులను పెట్టుకునే ఆర్థిక స్థోమత లేకపోతే మండల న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ముద్దాయిలకు జైలులో ఏమన్నా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగితే ఇబ్బందులు లేవని ముద్దాయిలు చెప్పారు. ఒక ముద్దాయి బోర్డుపై వేసిన డ్రాయింగ్‌ను మెచ్చుకున్నారు. న్యాయమూర్తి జైలు పరిసరాలను, మహిళా బ్యారక్‌ను, సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్, ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్‌ను, వంటశాలను తనిఖీ చేసి, భోజనాన్ని రుచి చూశారు. పరిసరాలలో వివిధ రకాల మొక్కలను పెంచి మరోసారి వచ్చేటప్పటికి పచ్చదనంగా ఉండాలని జైలు పర్యవేక్షణాధికారికి సూచించారు. జైలు ఆధ్వర్యంలో నడుపుతున్న పెట్రోల్ బంక్‌ను చూసి ప్రశంసించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ డి.వెంకటగిరి, జైలు న్యాయ సేవా కేంద్రం ఉచిత న్యాయవాది పి.అంబేద్కర్, న్యాయవాదులు కె.జ్యోతి, డి.రవికిరణ్, పారా లీగల్ వలంటీర్ వి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



సుబ్బాయమ్మ (ఫైల్)

గణపవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గణపవరంకు చెందిన పువ్వాడ వెంకట సుబ్బాయమ్మ (105) శతాధిక వృద్ధురాలు ఆదివారం మరణించారు. భర్త స్వర్గీయ పువ్వాడ సుబ్బారావు పంచాయతీ ఉద్యోగిగా పని చేశారు. వీరికి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకట సుబ్బాయమ్మ ఇప్పటి వరకు ఆరోగ్యంగానే ఉన్నారని, అయితే ఆదివారం మాత్రం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా మృతి చెందారని బంధువులు తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

భీమవరం క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఒకటవ పట్టణ పరిధిలో అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో వన్‌టౌన్ సీఐ నాగరాజు సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 11 మందిని అరెస్ట్ చేసి రూ.75 వేల 130 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

తాడేపల్లిగూడెం టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కవి కోకిల, విశారద, నవయుగ కవి గుర్రం జాషువాను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ పట్టణ అధ్యక్షుడు హరికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం సీనియర్ సిటిజన్స్ భవనంలో 130వ జాషువా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి వైవీఎస్ మూర్తి, సహఅధ్యక్షుడు కె. బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎం.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

తణుకు రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన గొప్ప దేశభక్తుడు సర్దార్ భగత్‌సింగ్ అని వేల్పూరు భగత్‌సింగ్ యువజన సంఘం అధ్యక్షుడు సిద్దాని శివగణపతి అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా వేల్పూరు బైపాస్ రోడ్డులో గల భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ పోరాటాలను వివరించారు. కార్యక్రమంలో దున్నే రుద్ర నాగేశ్వరరావు, మోటుపల్లి తరుణ్, విశ్వనాథం శివ, త్రినాథ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా సెక్రటరీ రత్న ప్రసాద్

తణుకు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయ మూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. ఆదివారం తణుకులో సబ్‌జైల్‌ను సందర్శించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న ఆహార వసతి, వైద్య సదుపాయాలను తెలుసుకున్నారు. ప్రతి ముద్దాయి తరఫున వాదించడానికి న్యాయవాదిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా ఆర్థిక స్థోమత లేకపోతే వారి తరఫున న్యాయ సేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తారని వివరించారు. వాయిదాలకు కోర్టుకు తీసుకెళ్లే ముద్దాయిలను వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రవేశపెట్టాలని చెప్పారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా సెక్రటరీ కె.రత్నప్రసాదు, జైలు విజిటింగ్ న్యాయవాది మోతి, పారా లీగల్ వలంటీర్లు, జైలు సూపరింటెండెంట్ మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె వాయిదా


తణుకు ఆసుపత్రి ప్రాంగణంలో మాట్లాడుతున్న భీమారావు

తణుకు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తణుకు ఆసుపత్రిలోని పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 29నుంచి చేపట్టిన సమ్మెను అధికారుల హామీ మేరకు తాత్కాలింగా వాయిదా వేస్తున్నట్టు ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు చెప్పారు. ఆదివారం ఆసుపత్రి ప్రాంగణంలో కార్మికులతో కలిసి ఆయన మాట్లా డారు. డీసీహెచ్ఎస్ సూర్యనారాయణ కార్మికులు సమస్యలు అక్టోబరు ఒకటో తేదీకి పరిష్కారం చేస్తామని అప్పటివరకు గడువు కావాలని కోరినట్టు చెప్పారు. ఈమేరకు సమ్మెను వాయిదా వేశామన్నారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

తణుకు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పీ.వీ.ప్రతాప్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో సీపీఎం విస్తృతస్థాయి సమావేశం పట్టణ కార్యదర్శి అజయకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలని, గోస్తనీ కాలువలో కాలుష్యం నిర్మూలించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు కామన మునిస్వామి, చిన వీరభద్రం, గార రంగారావు, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

భీమవరం క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఒకటవ పట్టణ పరిధిలో అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో వన్‌టౌన్ సీఐ నాగరాజు సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 11 మందిని అరెస్ట్ చేసి రూ.75 వేల 130 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.


వీరంపాలెంలో కాళరాత్రిదేవిగా బాలాత్రిపుర సుందరిదేవి


తాడేపల్లిగూడెంలో వాసవీమాత ఆలయంలో ఎమ్మెల్యేను సన్మానించిన ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు


ముత్యాలంబపురంలో ముత్యాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బొలిశెట్టి


తాడేపల్లిగూడెంలో విశ్వదుర్గేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న వలవల బాబ్జి


తాడేపల్లిగూడెం వీకర్స్‌కాలనీలో శ్రీమహంకాళిగా గాయత్రీమాత

మహా చండీదేవి నమోస్తుతే

- ఏడో రోజు వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు
- భక్తులతో ఆలయాలు కిటకిట

తాడేపల్లిగూడెం/తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) :తాడేపల్లిగూడెం పురదేవత బలుసులమ్మకు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహాచండిగా అలంకరించారు. ఏర్పాట్లను ఆలయ నిర్వాహకుడు శ్రీరంగం అంజి పర్యవేక్షించారు. వాసవి పంచాయతన క్షేత్రంలో ఉన్న వాసవీ మాతను మహాలక్ష్మి అలంకరణ చేశారు. వీకర్స్‌కాలనీలో ఉన్న గాయత్రి మాతకు శ్రీమహంకాళీ అలంకరణ చేశారు.

● బలుసులమ్మ, వాసవీ మాతకు ఎమ్మెల్యే బొలిశెట్టి పూజలు

బలుసులమ్మ, వాసవీమాతను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. 2026లో బలుసులమ్మ జాతర కనుల పండుగగా నిర్వహించాలని కోరారు. ఆర్యవైశ్యసంఘం నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

● తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి దేవిని ఆదివారం కాలరాత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణసిద్ధాంతి కాలరాత్రి అమ్మవారి అవతార విశిష్టత తెలిపారు. ముత్యాలంబపురంలో ముత్యాలమ్మను మహిషాసురమర్థిని దేవిగా భక్తులకు దర్శనవిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆరుగొలను విజయదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారికి రూ.32 లక్షలతో ధనలక్ష్మి అలంకరణ చేశారు. నీలాద్రిపురంలో కొత్తగూడెం కృష్ణుడి ఆలయం వద్ద రూ.52 లక్షలతో దుర్గమ్మకు ధనలక్ష్మి అలంకరణ చేశారు.

● శాకాంబరీగా విశ్వదుర్గేశ్వరి అమ్మవారు

పెంటపాడు : తాడేపల్లిగూడెం పట్టణంలోని 17వ వార్డులో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో విశ్వదుర్గేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న దసరా వేడుకలలో భాగంగా ఆదివారం అమ్మవారిని పలు రకాల కూరగాయలతో శాకాంబరీగా అలంకరించారు. భవన కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, సబ్బిను కృష్ణమోహన్, ముత్యాల శ్రీనివాస్, ముప్పిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యల్లారమ్మకు పూజలు

● తణుకు రూరల్ : దేవీ శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా తణుకు మండలంలోని పలు దేవాలయాల్లోని అమ్మవార్లను మహాచండీదేవి అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు విచ్చేసి పూజలు నిర్వహించారు. ఆదివారం దువ్వ గ్రామంలో ఉన్న శ్రీదానేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండపాకలోని యల్లార మ్మను మహాచండీదేవి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో భవానీ పీఠాలలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


మహా చండీ అలంకరణలో మండపాక యల్లారమ్మ


కె.పెంటపాడులో ఉచిత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

పెంటపాడు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధి ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని ఆదివారం కె.పెంటపాడులో మండల అధ్యక్షుడు ఇమ్మంది శ్రీనివాస్ అధ్యక్షతన ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తొలుత ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో దత్తు ప్రసాద్, సర్పంచ్ పీతల సత్యనారాయణ, ఉపసర్పంచ్ పంతం శివరామకృష్ణ, కర్రి గిరీష్‌రెడ్డి, జామి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్ఆర్ వల్లే బాలకృష్ణ జైలు పాలు కాలేదు'

తణుకు రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దయతోనే హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ జైలుపాలు కాకుండా వున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం తణుకు వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో బాలకృష్ణ తీరు చూస్తుంటే మద్యం తాగివచ్చినట్టు హావ భావాలున్నాయన్నారు. అసెంబ్లీలో చిరంజీవిని అవమానించినా ఆయన తమ్ముళ్లు మాత్రం మౌనంగానే ఉండడం సిగ్గుచేటన్నారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ చేపట్టిన డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ర్యాబిస్ నివారణపై అవగాహన ర్యాలీ

భీమవరం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ ర్యాబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28వ తేదీన లూయిస్ పాశ్చర్ వర్ధంతి సందర్భంగా జాతీయ ర్యాబిస్ నివారణ దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. ర్యాబిస్ అనేది కుక్కలు, పిల్లులు, అడవి జంతువుల ద్వారా మనుషులకి వ్యాప్తి చెందుతుందని, ఇది ఒక ప్రమాదకరమైన వైరస్ అని అన్నారు. ఒకసారి వ్యాధి వస్తే చికిత్స లేకుండా ప్రాణాంతకం అవుతుందని, అయితే ముందు జాగ్రత్తలతో ర్యాబిస్‌ను వంద శాతం నివా రించవచ్చునని పేర్కొన్నారు. ర్యాబిస్ నివారణకు కుక్కలు, పిల్లులు, పెంపుడు జంతువులకు తప్పనిసరిగా ర్యాబిస్ వాక్సిన్ వేయించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మొగల్తూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):మొగల్తూరులోని పెన్మత్స రంగరాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 2000-01 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఇదే పాఠశాలలో 25 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. అలనాటి వారి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ నాటి చదువులు, అలనాటి పాఠశాలలో జరిగిన సంఘటనలు చర్చించుకున్నారు. వీరికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు రంగమన్నార్, నాటి హెచ్ఎం మేరీ ప్రసాదమ్మ, తదితరులు ఘనంగా సన్మానించి మెమెంటోలు అందించారు.

వేమన పద్యాల పోటీలు

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):స్థానిక లవ్ పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చిల్డ్రన్ హోంలో వేమ న పద్యాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఫౌండేషన్ చైర్మన్ ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించి మాట్లా డుతూ చిన్నతనం నుంచి తెలుగుభాషపైనా, పద్యాలపైనా అవ గాహన ఉండేందుకుగానూ ఈపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు నగదు పారితోషికం, షీల్డ్‌లు అందించారు. ము గ్గురికి కన్సోలేషన్ బహు మతులు, 14 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కోలాటి చిన పెద్దిరాజు, కొల్లాబత్తుల సూర్య కుమార్, జానీ పాల్గొన్నారు.


రచయిత గుర్రం జాషువా జయంతిలో పలువురికి సత్కారం

సమసమాజం కోసం పోరాడిన కవి జాషువా

భీమవరం టౌన్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : కుల, మత అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం తన కలంతో పోరాటం చేసిన మహాకవి గుర్రం జాషువా అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. గుర్రం జాషువా 130వ జయంతిని పురస్కరించుకుని జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం భీమవరం కె.ఎస్.రాజు ఫంక్షన్ హాల్‌లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ హాజరై గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలిగొట్ల గోపాల శర్మ, వేల్పుల నాగేశ్వరరావు, జువ్వాది దాశరధి శ్రీనివాస్‌లను సత్కరించారు. అనంతరం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ముద్రించిన కవి కోకిల గుర్రం జాషువా జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బోగిరెడ్డి ఆదిలక్ష్మి, నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్‌రాజు, జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి పాల్గొన్నారు

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

పెనుగొండ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):విద్య, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన ఉభయ గోదావరి జిల్లా ఆర్యవైశ్య విద్యార్థులకు వాసవీ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ పీఎన్ గోవిందరాజులు ఆధ్వర్యంలో అవార్డులు అందించారు. ఆదివారం వాసవి ధామ్ టెంపుల్‌లో ప్రతిభా సన్మాన్ అవార్డు 2024-25 కార్యక్రమంలో భాగంగా ప్రతిభా వంతులైన విద్యార్థులకు 370 మందికి అవార్డులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కర్ణాటక రాష్ట్రం తూంకూరు యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ శ్రీ ఎం. వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షు డు చిన్ని రామ సత్యనారాయణ చేతులు మీదుగా ప్రతిభ అవార్డులు అందజేశారు. ముందుగా పెనుగొండలో పురవీధులు గుండా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

భక్తులకు నిరాశ..

పెనుగొండ వాసవి శాంతి ధామ్‌లో భక్తులకు ఆదివారం నిరాశ ఎదురైంది. సుదూర ప్రాంతాల నుంచి ప్రతిభ సన్మాన్ అవార్డులు తీసుకోవడానికి వచ్చిన భక్తులకు ప్రసాదం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం 1 గంట సమయం దాటినా అన్నదానం మొదలు పెట్టకపోవడంతో గంటల తరబడి భక్తులు నిల్చుండిపోయారు. సుమారు రెండు గంటల సమయం అయినా అన్నదానం చేయకపోవడంతో చాలా మంది వెనుతిరిగి వెళ్ళిపోయారు. దీంతో శాంతి ధామ్ నుంచి శ్రీ నగరేశ్వర స్వామి మహిషాసురమర్ధని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవార్ల ఆలయానికి చేరుకుని ప్రసాదం స్వీకరించారు.

హిందువులు సమైక్యంగా ఉండాలి

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతి శిశు మందిరం హైస్కూల్లో ఆదివారం వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ జిల్లా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రాంతీయ అధికారి సుబ్బరాజు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ హిందూ బంధు వులు అందరూ సమైక్యంగా ఉండాలని మన పండుగల్లో ప్రతి కార్యకర్త పాల్గొని హిందుత్వాన్ని కనపరచాలని తెలిపారు. పాలకొల్లు, నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, ఉండి, పాలకోడేరు పోడూరు. పెనుగొండ మండలాలు, పట్టణాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.



ముత్యాలమ్మకు వెండి పాదాలు

మొగల్తూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):మొగల్తూరు గ్రామ ప్రజల ఆరాధ్యదేవత నడివీధి ముత్యాలమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన కల్‌తిల్ నవీన్ గోపి వరలక్ష్మి దంపతులు కిలో బరువు గల వెండి పాదాలు బహూకరించారు. ఈనెల 8న ముత్యాలమ్మ అమ్మవారి పూరిపాక, గరగలు దగ్ధం కావడంతో సోమవారం పునఃప్రతిష్ట, మహా అన్న సమారాధన కార్యాక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి కొత్తగా తయారు చేయించిన గరగలు, వెండి పాదాలుకు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు.

ర్యాబిస్ నివారణపై అవగాహన ర్యాలీ

భీమవరం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ ర్యాబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28వ తేదీన లూయిస్ పాశ్చర్ వర్ధంతి సందర్భంగా జాతీయ ర్యాబిస్ నివారణ దినో త్సవం జరుపుకుంటున్నామని అన్నారు. ర్యాబిస్ అనేది కుక్కలు, పిల్లులు, అడవి జంతువుల ద్వారా మనుషులకి వ్యాప్తి చెందుతుందని, ఇది ఒక ప్రమాదకరమైన వైరస్ అని అన్నారు.

మావుళ్లమ్మ, సోమేశ్వరస్వామికి జీఎస్టీ అధికారి పూజలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ జాయింట్ కమిషనర్ (ఏలూరు డివిజన్) బి.నాగార్జున రావు కుటుంబ సభ్యులతో పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని ఉమా సోమేశ్వర జనార్దన స్వామి వారిని, మావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు అనంతరం వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున ప్రసాదాన్ని శేష వస్త్రాన్ని అందించారు. ఆయన వెంట ఉద్యోగ సిబ్బంది జీఎస్టీఅధికారి వర్దనపు రాజేష్ కుమార్, తుమ్మిడి రాజశేఖర్, ఎమ్.కె.దుర్గారావు, షబ్బీర్, శివ న్నారాయణ


సమావేశానికి విచ్చేసిన ఆర్యవైశ్య ప్రముఖులు

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

పెనుగొండ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):విద్య, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన ఉభయగోదావరి జిల్లా ఆర్యవైశ్య విద్యార్థులకు వాసవీ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజులు ఆధ్వర్యంలో అవార్డులు అందించారు. ఆదివారం వాసవి ధామ్ టెంపుల్‌లో ప్రతిభ సన్మాన్ అవార్డు 2024-25 కార్యక్రమంలో భాగంగా ప్రతిభా వంతులైన విద్యార్థులకు 370 మందికి అవార్డులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కర్ణాటక రాష్ట్రం తూంకూరు యూనివర్శిటీ వైస్ చాన్సలర్ శ్రీ ఎం. వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ చేతులు మీదుగా ప్రతిభ అవార్డులు అందజేశారు. ముందుగా పెనుగొండలో పురవీధులు గుండా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

భక్తులకు నిరాశ....

పెనుగొండ వాసవి శాంతి ధామ్‌లో భక్తులకు ఆదివారం నిరాశ ఎదురైంది. సుదూర ప్రాంతాల నుంచి ప్రతిభ సన్మాన్ అవార్డులు తీసుకోవడానికి వచ్చిన భక్తులకు ప్రసాదం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం 1 గంట సమయం దాటినా అన్నదానం మొదలుపెట్టకపోవడంతో గంటల తరబడి భక్తులు నిల్చుండిపోయారు. సుమారు రెండు గంటల సమయం అయినా అన్నదానం చేయకపోవడంతో చాలా మంది వెనుతిరిగి వెళ్ళిపోయారు. దీంతో శాంతి ధామ్ నుంచి శ్రీ నగరేశ్వర స్వామి మహిషాసురమర్ధని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవార్ల ఆలయానికి చేరుకుని ప్రసాదం స్వీకరించారు.

బోనాలతో గ్రామోత్సవం

కాళ్ళ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోమటిగుంట గ్రామం అమ్మవారి నామ స్మరణతో మారుమ్రోగింది. శరన్నవ రాత్రులను పురస్కరించుకుని కోమటిగుంట గ్రామంలో బోనాల సంబరాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు 200 మంది మహిళా భక్తులు ప్రత్యేక అలంకరణలో, భవాని మాల ధారులు నెత్తిన బోనాలు పెట్టుకుని గ్రామోత్సవం నిర్వహించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మొగల్తూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి జెట్టిపాలెంలో పేకాట స్థావరంపై ఆదివారం మొగల్తూరు పోలీసులు దాడి చేశారు. ఈదాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద గల రూ.12,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపారు.


పాలకొల్లులో రూ.1.40 కోట్లతో ధనలక్ష్మి అలంకారంలో వాసవీ మాత .. లలితా త్రిపుర సుందరి అవతారంలో కనక దుర్గమ్మ.. మహాచండిదేవిగా యలమంచిలి శివాలయంలోని అమ్మవారు.. పెదమల్లంలో మాచేనమ్మ

మహాచండి అలంకరణ

వైభవంగా దసరా వేడుకలు... కుంకుమ పూజలు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రుల్లో భాగంగా 7వ రోజు ఆదివారం పట్టణంలో పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. అమ్మవార్లను ప్రత్యేంగా ఆలంకరించి కుంకుమ పూజలు చేశారు. ప్రసిద్ధి చెందిన శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, రాత్రి అమ్మవారిని మహాచండీగా అలంకరించారు. ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, చైర్మన్ మీసాల రాము, ట్రస్టీలు, సిబ్బంది, ఆలయ అర్చకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వాసవీ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో చిన్నగోపురం వీధిలోని కళ్యాణ మండపంలో అమ్మవారిని రూ. 1.40 కోట్ల రూపాయలతో ధనలక్ష్మిగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు లలితా సహస్ర నామ పారాయణం చేశారు. కనకదుర్గ ఆలయంలో అమ్మవారని ప్రత్యేక వేదికపై శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. కార్యక్రమంలో ఈవో ఎన్ సతీష్ కుమార్, అర్చకులు ఎం వెంకట రమణ, సిబ్బంది చిట్టి రాంబాబు, కె సత్యనారాయణ, వలంటీర్లు సేవలందించారు. శంభేశ్వర స్వామి ఆలయంలోనూ రత్నామాంబా దేవిని ప్రత్యేకంగా అలంకరించారు. డైలీ మార్కెట్ వెంకటేశ్వర స్వామి ఆలయం, పలు ఆలయాల్లోనూ పూజలు నిర్వహించారు.

పెనుగొండ: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 7వ రోజు ఆదివారం వాసవి అమ్మవారు శ్రీ రాజ రాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

నరసాపురం రూరల్: మండలంలోని సరిపల్లి గ్రామంలోని అంజనేయస్వామి ఆలయం వద్ద దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహాన్ని ఆలయ కమిటీ కరెన్సీ నోట్లతో అలంకరణ చేశారు. సుమారు రూ.6.50లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారి విగ్రహాన్ని, మండపాన్ని పూర్తిగా అలంకరణ చేశారు. ఈ అలంకరణను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో సరిపల్లికి తరలి వచ్చారు. చినలంక గ్రామంలో కనకదుర్గ అమ్మవారు వారాహి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం వద్ద సామూహిక కుంకమ పూజలు నిర్వహించారు. ఎల్‌బిచర్ల గ్రామంలో కనకదుర్గ ఆలయం వద్ద చండీయాగం, రుద్రాభిషేకం, పాలభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు.

ఆచంట: దసరా ఉత్సవాలు మండలంలో అన్ని చోట్ల వేడుకగా జరుగుతున్నాయి. ఆదివారం పెదమల్లం మాచేనమ్మ, ఆచంట పార్వతి అమ్మవారు మహాచండి దేవిలుగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

మొగల్తూరు: మండలంలోని దుర్గాదేవి ఆలయాలతో పాటు కూడళ్ళలో నిలబెట్టిన అమ్మవార్లను మహాచండీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొగల్తూరులోని భవానీ కాలనీ దుర్గమ్మ అమ్మవారు, పార్వతీదేవి, పేరుపాలెం రజకులపేట దుర్గమ్మ అమ్మవార్లతో పాటు కూరగాయల మార్కెట్, కోట, కుక్కలవారితోట, గుంటపల్లవపాలెం, సత్రవుపాలెం గ్రామాల్లో నిలబెట్టిన అమ్మవార్లను మహచండీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెనుమంట్ర: మార్టేరులో కనకదుర్గ అమ్మవారిని చండిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు మహిళలు సామూహిక కుంకుమార్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తేతలి రాజారెడ్డి ఏర్పాట్లు చేశారు. పొలమూరు శ్రీ పోలేరమ్మ, మహంకాళి అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు లలితా పారాయణ చేశారు. పెనుమంట్ర కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భవాని భక్తులు గురు భవాని గంటా వాసు ఆధ్వర్యంలో విశేష అలంకారంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

యలమంచిలి: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా యలమంచిలి శివాలయంలోని అమ్మవారు మహాచండిదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చనలు చేశారు. అధికసంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు.


సరిపల్లిలో కరెన్సీతో దుర్గమ్మకు అలంకరణ

ముత్యాలమ్మకు వెండి పాదాలు బహూకరణ



మొగల్తూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):మొగల్తూరు గ్రామ ప్రజల ఆరాధ్యదేవత నడివీధి ముత్యాలమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన కల్‌తిల్ నవీన్ గోపి వరలక్ష్మీ దంపతులు కిలో బరువు గల వెండి పాదాలు బహూకరించారు. ఈనెల 8న ముత్యాలమ్మ అమ్మవారి పూరిపాక, గరగలు దగ్ధం కావడంతో సోమవారం పునఃప్రతిష్ఠ, మహ అన్న సమారాధన కార్యాక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి కొత్తగా తయారు చేయించిన గరగలు, వెండి పాదాలుకు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు.

గ్రామశుద్ధి

అమ్మవారి పునప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామశుద్ధి నిర్వహించారు. గ్రామానికి ఎటువంటి అరిష్టం జరగకూడదని గ్రామస్థులు గ్రామశుద్ధి నిర్వహించారు. ప్రతి ఇంటిని శుద్ధి చేసుకోవడంతో పాటు గ్రామస్థులు ప్రధాన సెంటర్‌లో శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో అమ్మవారి భక్తిగీతాలు ఆలపిస్తూ అమ్మవారి గరగలు, పాదాలను రథంపై ఊరేగిస్తూ బాణసంచా కాలుస్తూ తీన్ మార్ వాయిద్యాలతో గ్రామాన్ని శుద్ధి చేశారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మొగల్తూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):మొగల్తూరులోని పెన్మత్స రంగరాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 2000-01 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఇదే పాఠశాలలో 25 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. అలనాటి వారి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ నాటి చదువులు, అలనాటి పాఠశాలలో జరిగిన సంఘటనలు చర్చించుకున్నారు. వీరికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయలు రంగమన్నార్, నాటి హెచ్‌ఎం మేరీ ప్రసాదమ్మ, క్రాఫ్ట్ టీచర్ కిరణ్మయి, ఎంఎస్‌ఆర్‌కె ప్రసాద్, డ్రిల్ మాస్టర్ వాసు, సత్యనారాయణ, పడాల భాస్కరరావు, ఉదయ భాస్కరరావు, నాగరాజు, కొల్లాటి బ్రహ్మయ్యలను ఘనంగా సన్మానించి మెమెంటోలు అందించారు.

నేడు కొవ్వలి రాక



నరసాపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి నాయుడు సోమవారం అమెరికా నుంచి నరసాపురం వస్తున్నారు. దీపావళి వరకు ఆయన నరసాపురంలో ఉంటారని టీడీపీ నాయకులు సంకు భాస్కర్ తెలిపారు. ఇదే క్రమంలో పార్టీ అధినేత చంద్రబాబును కూడా కలవనున్నారు. ఈ 20 రోజులు పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటారు.

సబ్‌జైల్ ఆకస్మిక తనిఖీ

నరసాపురం టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైలును ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో పరిశుభ్రత, ఖైదీలకు అందుతున్న మెను, ఆరోగ్యం, ఇతర సదుపాయాలను రిమాండ్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం ఏపీ కేసుల్లో అరెస్టు అయి వచ్చారన్న విషయాన్ని ఆరా తీశారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సలహా కేంద్రం ద్వారా సేవలందిస్తామని వివరించారు. ఆమె వెంట న్యాయమూర్తి రత్నప్రసాద్, సబ్‌జైలు అధికారి అప్పారావు, న్యాయవాదులు శిరిష, చిట్టి పద్మ, శ్యామ్‌కుమార్ ఉన్నారు.



న్యాయ సలహా కేంద్రాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి శ్రీదేవి

వేమన పద్యాల పోటీలు

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):స్థానిక లవ్ పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చిల్డ్రన్ హోంలో వేమన పద్యాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఫౌండేషన్ ఛైర్మన్ ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ చిన్నతనం నుంచి తెలుగుభాషపైనా, పద్యాలపైనా అవగాహన ఉండేందుకుగానూ ఈపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు నగదు పారితోషికం, షీల్డ్‌లు అందించారు. ముగ్గురికి కన్సోలేషన్ బహుమతులు, 14 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కోలాటి చినపెద్దిరాజు, కొల్లాబత్తుల సూర్య కుమార్, జానీ పాల్గొన్నారు.



పద్యాల పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

దుర్గమ్మకు వెండి హారం



ఆచంట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):కొడమంచిలిలో దుర్గమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన భక్తులు నెక్కంటి వీర వెంకట సత్య రామచంద్రరావు, వెంకటలక్ష్మి సౌమ్య దంపతులు వెండి హారం, చీర బహూకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

19న ధన్వంతరి జయంతి

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం సమావేశం నాయీ బ్రాహ్మణ సంఘ భవనంలో ఆదివారం జరిగింది. సమావేశానికి అధ్యక్షుడు ర్యాలీ విష్ణుమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ వైద్య పితామహుడు నాయీ బ్రాహ్మణ ఆదిపురుషుడు ధన్వంతరీ మహాదేవుని జయంతిని వచ్చేనెల 19వ తేదీన ఘనంగా నిర్వహించడానికి సంఘ సభ్యులు సహకరించాలని సూచించారు. ఈసందర్భంగా వైద్య వృత్తిలో కొనసాగుతున్న నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులను సత్కరించాలని తీర్మానించారు.



పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్, బజరంగ్ దళ్ సభ్యులు

హిందువులు సమైక్యంగా ఉండాలి

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతి శిశు మందిరం హైస్కూల్లో ఆదివారం వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ జిల్లా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రాంతీయ అధికారి సుబ్బరాజు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ హిందూ బంధువులు అందరూ సమైక్యంగా ఉండాలని మన పండుగల్లో ప్రతి కార్యకర్త పాల్గొని హిందూత్వాన్ని కనపరచాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పాలకొల్లు, నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, ఉండి, పాలకోడేరు పోడూరు. పెనుగొండ, యలమంచిలి మండలాలు, పట్టణాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్యాన సాధనతో ప్రశాంతత

డాక్టర్ సాంబశివరావు

పెనుమంట్ర, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో ఆధ్యాత్మికతను గ్రంధస్థము చేసిన మొదటి గురువు పతంజలి మహర్షి అని, ఆరోగ్య ఆనందమయ జీవనానికి అష్టాంగ మార్గమే శరణ్యమని, పత్రీజీ ప్రబోధించిన ధ్యానసాధన ప్రశాంతతకు దోహదం చేస్తుందని డాక్టర్ ఉండ్రమట్ల సాంబశివరావు అన్నారు. ఆదివారం పెనుమంట్ర గ్రామంలో భూపతిరాజు శ్రీనివాసరాజు, సాయిగీత దంపతులచే నిర్మించిన బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ధ్యానమందిరం వద్ద ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వాస్తవానికి మనమే సృష్టికర్తలమని, దుఃఖ రాహిత్య స్థితి పొందాలంటే తోటివారితో మైత్రి భావన కలిగి ఉండాలని తెలిపారు. నిర్వాహకులు సాంబశివరావును ఘనంగా సత్కరించారు. ఈ జిల్లా కో-ఆర్డినేటర్ కె.వి.డి.ప్రసాద్ మాట్లాడుతూ వచ్చేనెల 2న శ్రీవశిష్ట గౌతమి పిరమిడ్ మహాశక్తి క్షేత్రం ఆధ్వర్యంలో రాజమండ్రి పట్టణంలో నిర్వహించే మెగా శాకాహార సద్భావనర్యాలీకి అందరూ తరలి రావాలని పిలుపునిచ్చి దానికి సంబంధించిన ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వశిష్ఠ గౌతమి పిరమిడ్ మహాక్షేత్రం మెంబరు కె.వి.ఎస్.వాసు, వడ్డి దుర్గా ప్రసాద్, తోట మధు, భూపతిరాజు రాధ, ఎం.లక్ష్మి, మౌనిక, పద్మ, తులసమ్మ, మధు పాల్గొన్నారు.